
సాక్షి ఒడిశా

శుక్రవారం । 20 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,54,055లు, బంగారం 1 గ్రాము 700ల మిల్లీ గ్రాములు, వెండి 45గ్రాముల 500 మిల్లీ గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ఉత్సాహంగా మిస్టర్ ఒడిశా పోటీలు

- 8లో



బ్యాంకు కాలనీలో చోరీ

- 8లో

న్యూస్‌రీల్

చిరుత చర్మం స్వాధీనం

● ముగ్గురు అరెస్టు



పులిచర్మంతో పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు ప్రాంతం అటవీ శాఖ సిబ్బంది గురువారం ఉదయం చిరుత పులి చర్మాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మోటు ప్రాంతంలో పులి చర్మాన్ని గిరిజనులు అమ్ముతున్నట్లు ముందస్తు సమాచారంతో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి మోటు ప్రాంతం సిబ్బందికి ఆదేశించారు. వారు కలిమెల నుంచి పొట్టేరు వరకు నిఘా వేయగా పొట్టేరు కెనాల్ ప్రాంతంలో తెల్లవారు జామున కలిమెల సమితి మాన్యంకొండ పంచాయతీ మంగిపల్లి గ్రామానికి ముకేష్ మాడ్కమి, దుల మాడ్కమి, పేంట మడ్కామిలు ఒక బ్యాగ్‌ను తీసుకెళ్తుండగా గమనించారు. వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో బ్యాగ్‌ను తనిఖీ చేయగా, అందులో పులిచర్మం గుర్తించారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, 1.13 మీటర్ల పులిచర్మం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

100 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు నిందితులు అరెస్టు



పట్టుబడిన నిందితులు, గంజాయిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: స్థానిక ఎక్సైజ్ విభాగం అధికారులు రెండు వేర్వేరు చోట్ల గురువారం దాడులు నిర్వహించి 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ సత్పతి తెలిపిన వివరాల మేరకు.. అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం రావడంతో నగర శివారులోని ఫస్ట్‌గేట్ జంక్షన్ వద్ద గస్తీ నిర్వహించారు. ఆ సమయంలో గజపతి జిల్లా మోహన పోలీసుస్టేషన్ పరిధి గుముసర అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరం మీదుగా కోల్‌కత్తాకి గంజాయిని తరలిస్తున్న కారుపై దాడులు నిర్వహించి, 50 కిలోల గంజాయితో పాటు కారుని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుడు మోహన బ్లాక్‌కు చెందిన మున్నా నాయక్‌గా పేర్కొన్నారు. అదేవిధంగా దిగపండి పోలీసుస్టేషన్ పరిధి బల్లిపడా జంక్షన్‌లో మరో కారు, స్కూటీపై దాడులు నిర్వహించి 50 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అలాగే మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు కల్లు పరిడా, సన్యాసి గౌడాలుగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

స్వీట్స్ వ్యాపారి ఇంట్లో చోరీ



గ్రిల్స్ తొలగించిన దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని కేవుటివీధిలో నివాసముంటున్న బోయిన భాస్కరరావు అనే స్వీట్స్ వ్యాపారి ఇంట్లో బుధవారం రాత్రి దొంగతన జరిగింది. ఈ మేరకు 5 తులాల బంగారం, వెండి వస్తువులు 11 కిలోలు, లక్షన్నర నగదు దుండగులు దోచుకెళ్లినట్లు ఆదర్శ పోలీసుస్టేషన్‌లో భాస్కరరావు గురువారం ఉదయం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కనుమ పండుగ రోజున సదరు వ్యాపారి కుటుంబం బుడితి గ్రామం వెళ్లారు. ఇద్దరు కోడళ్లలో చిన్న కోడలు గారబంద కన్నవారింటికి వెళ్లిపోగా, పెద్ద కోడలు పర్లాకిమిడిలోని కోమటివీధి కన్నవారింటికి వెళ్లింది. అయితే గురువారం మొత్తం కుటుంబం ఇంట్లోకి వచ్చి చూడగా బయట బాల్కనీ నుంచి గ్రిల్ తొలగించి, ఇంట్లోకి దొంగలు చొరబడి రెండు బీరువాల్లో ఉన్న బంగారం, వెండి వస్తువులు, డబ్బు దోచుకెళ్లినట్లు గుర్తించినట్లు ఐఐసీ వివేకనంద స్వాయినికి తెలియజేశారు. ఫిర్యాదుదారుడు మార్కెట్ వద్ద స్వీట్స్ దుకాణం నడుపుతున్నాడు. ఈ కేసుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. వారం రోజుల క్రితం రాణీ పద్మావతి కాలనీలో సైతం రాత్రి ఏడు గంటల సమయంలో దొంగతనం జరిగి బంగారం, వెండి వస్తువులు చోరీకి గురవ్వడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరీక్షణకు తెర



బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరిన డకోటా విమానం

● ఒడిశా చేరిన డకోటా విమానం
● స్వాగతం పలికిన సీఎం నవీన్ పట్నాయక్



పూలతో స్వాగతం పలుకుతున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్:

దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌కు ఇష్టమైన డకోటా (డీసీ–3) వీటీ ఏయూఐ ఒడిశా చేరడంతో రాష్ట్ర ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. కట్టుదిట్టమైన భద్రత మధ్య కోల్‌కతా నుంచి మూడు లారీలలో విమానం విడి పరికరాలు బుధవారం రాత్రి భువనేశ్వర్ చేరుకున్నాయి. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో తాత్కాలికంగా నిలిపారు. ప్రజల ప్రదర్శన కోసం త్వరలో టెర్మినల్–1 ప్రాంగణానికి తరలిస్తారు. దీనికోసం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా 1.1 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించింది. అక్కడ విడి భాగాలతో చేరిన డకోటా విమానం పునరుద్ధరించబడుతుంది. బిజూ జయంతి సందర్భంగా ఈ ఏడాది మార్చి 5వ తేదీన సీఎం నవీన్ పట్నాయక్ ప్రజా ప్రదర్శనను ప్రారంభించనున్నారు.

సీఎం నవీన్ భావోద్వేగం

విమానాశ్రయానికి చేరిన డకోటా విమానాన్ని చూసేందుకు సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా విచ్చేశారు. విమానానికి పూలతో స్వాగతం పలికారు. తన తండ్రిని స్మరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. డకోటా విమానం ఎట్టకేలకు ఒడిశాకు తిరిగి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ విమానంతో తన తండ్రి బిజూ బాబుకు అనేక చారిత్రక అనుబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విమానంలో ఎన్నో ధైర్య సాహసాలు చేశారన్నారు. వాటిలో అత్యున్నతమైనది ఇండోనేషియా స్వాతంత్ర్య సమరయోధులను డచ్ నుంచి విముక్తి చేయడమని వెల్లడించారు. బిజూ బాబుతో ఒకే ఒక్క కో–పైలట్ ఉన్నారని, అది తన తల్లి జ్ఞాన్ పట్నాయక్ అని తెలియజేశారు. అదేవిధంగా రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బిజూబాబు ఈ విమానంలో చైనా, నేపాల్ తదితర దేశాలకు వెళ్లారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి అశోక్ చంద్ర పాండా, ఎమ్మెల్యేలు ప్రణబ్ ప్రకాష్ దాస్, అనంత్ నారాయణ్ జెనా, సుశాంత్ రౌత్, మేయర్ సులోచన దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల రక్షణకు ‘యాక్షన్ ప్లాన్’

● తక్షణమే అమలుకు హైకోర్టు ఆదేశాలు



గంజాం జిల్లా మణిపూర్ ప్రాంతంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఏనుగు

భువనేశ్వర్:

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఏనుగుల మరణాలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై హైకోర్టు ఘాటుగా స్పందించింది. దీనికి సంబంధించిన ఒక వ్యాజ్యాన్ని విచారించిన ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ ఎస్.మురళీధర్, జస్టిస్ ఎం.ఎస్.రామతో కూడిన ధర్మాసనం ఏనుగుల రక్షణకు రూపొందించిన ‘యాక్షన్ ప్లాన్’ను తక్షణమే అమలు చేయాలని సూచించింది. ఏనుగుల భద్రత అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ మేరకు ప్రతిపాదిత కార్యాచరణ ప్రణాళికను ఆలస్యం చేయకుండా రెండు వారాల్లోగా అమలు చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తక్షణ చర్యలు తీసుకుంటారు. ఆ తర్వాత ఏనుగుల రక్షణకు సంబంధించిన అన్ని సిఫార్సులను అమలు చేయనున్నారు. విచారణ సందర్భంగా మనోజ్ వి.నాయర్ ప్రభుత్వం తరపున అఫిడవిట్ దాఖలు చేశారు. ఏనుగుల రక్షణకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు, వివిధ స్థాయిల్లోని నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏనుగుల రక్షణ కోసం ఈ ‘యాక్షన్ ప్లాన్’ రూపొందించినట్లు వివరించారు. అయితే, ఈ ‘యాక్షన్ ప్లాన్’ రాష్ట్ర ప్రభుత్వ హై పవర్ కమిటీ (హెచ్‌సీసీ) ఆమోదం తర్వాత అమలు చేయబడుతుందని పేర్కొన్నారు. దీనికి 30 రోజుల సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరపున అఫిడవిట్‌లో అభ్యర్థించారు. జాయింట్ టాస్క్‌ఫోర్స్ (జేటీఎఫ్) చైర్మన్, సభ్యుడు, ఏనుగు సమస్యలపై నిపుణుడు డాక్టర్ రమణ్ సుకుమార్ వర్చువల్ మోడ్‌లో విచారణలో పాలుపంచుకున్నారు. తదుపరి విచారణకు జేటీఎఫ్ సభ్యులు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను మార్చి 13వ తేదీకి వాయిదా వేసింది.

అన్నదాత ఆందోళన



ధాన్యం బస్తాలతో నిరసన తెలుపుతున్న రైతులు

భువనేశ్వర్: మండీల్లో ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అవకతవకలపై నవ నిర్మాణ్ కృషక్ సంఘటన్ ఆధ్వర్యంలో ధాన్యం బస్తాలతో భద్రక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు గురువారం ఆందోళన చేశారు. జిల్లా రైతులకు మార్కెట్‌లో వరి విక్రయానికి టోకెన్ల జారీలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. కొనుగోలు సమయంలో ప్రతీ క్వింటాల్‌కు 8 నుంచి 10 కిలోల వరకు అవకతవకలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఎలుగు దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు



డోలీలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జయపురం: కట్టెలు కొడుతున్న ఒక వ్యక్తిపై ఎలుగు బంటి దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన బొరిగుమ్మ సమితి రాణిగుడ గ్రామ సమీప అడవిలో గురువారం చోటు చేసుకుంది. రాణిగుడ గ్రామానికి చెందిన రతన ముదులి(60) ఇంటి కోసం కట్టెలు కొట్టేందుకు గ్రామస్తులతో కలిసి సమీప అడవికి వెళ్లాడు. అతడు కట్టెలు కొడుతున్న సమయంలో అకస్మాత్తుగా ఒక ఎలుగు బంటి వెనుక నుంచి దాడి చేసింది. తీవ్రంగా గాయపడుతున్న ముదులి భయంతో గట్టిగా అరవడంతో మిగతావారు అక్కడికి వచ్చి అతికష్టంపై ఎలుగు బంటి నుంచి రక్షించారు. ఆ ప్రాంతానికి బిజసింగపూర్ ప్రాథమిక వైద్య కేంద్రం 5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ప్రాంతానికి రహదారి సదుపాయం లేకపోవడంతో కర్రలతో డోలీ తయారు చేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బొరిగుమ్మ కమ్యూనిటీ వైద్య కేంద్రానికి తరలించారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

● 136 సెల్‌ఫోన్లు స్వాధీనం



దొంగలు, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా ఛత్రపూర్ 16 నంబరు జాతీయ రహదారి పక్కనున్న మొబైల్ దుకాణంలో ఇటీవల జరిగిన దోపిడీకి సంబంధించి ఇద్దరు దొంగలను గుసానినువాగం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి సబ్యసచి మల్లి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి జాతీయ రహదారి పక్కనున్న భాగ్యలక్ష్మి నగర్‌లోని మొబైల్స్ దుకాణంలో దుండగులు చొరబడి సెల్‌ఫోన్లు, మొబైల్ ప్యాడ్‌లు, బ్లూ టూత్ హెడ్‌సెట్లు దోచుకొని పరారయ్యారు. ఘటనపై ఛత్రపూర్ పోలీసుస్టేషన్‌లో బాధిత దుకాణం యజమాని బిజయ కుమార్ దాస్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 136 సెల్‌ఫోన్లు, 4 చార్జర్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో శాస్త్రినగర్ 2వ లైన్‌కి చెందిన జి.గణేష్, గేట్ బజార్‌కి చెందిన అజయ్ కుమార్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

కళలకు పుట్టినిల్లు గజపతి జిల్లా



అద్భుతంగా తీర్చిదిద్దిన సభా వేదిక



పల్లెశ్రీ ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర సాహు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర సాహు, ఎమ్మెల్యే నారాయణరావు తదితరులు

● ఎంపీ చంద్రశేఖర సాహు

పర్లాకిమిడి: కళలు, సాంప్రదాయాలకు పుట్టినిల్లు గజపతి జిల్లా అని బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో గజపతి ఉత్సవాలు–2023ను బుధవారం ప్రారంభించారు. తొలుత గజపతి ఉత్సవాల్లో పల్లెశ్రీ ఉత్సవాలను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానవనం, ఐటీడీఏ, జిల్లా శిశు సంరక్షణ సమితి, మత్స్యశాఖ, మిషన్ శక్తి, స్వయం సహాయక గ్రూపులు తయారు చేసిన ఉత్పత్తులు, వ్యవసాయ శాఖ స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కళలను అప్పట్లో రాజులు పోషిస్తూ వస్తుండేవారని, వాటిని ఇప్పటి పాలకులు పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఎస్డీసీ చైర్మన్ మరియం రైతో, కలెక్టర్ లింగరాజ్ పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఏడీఎం సంగ్రాం శేఖర పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, యువరాణి కల్యాణీ దేవి గజపతి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణచంద్ర గజపతి రాజుల హయంలో నౌపడా-పర్లాకిమిడికి మధ్య 1910లో వేసిన స్టీమ్ రైలు ఇంజిన్ నమూనా



గజపతి ఉత్సవాల్లో సురభి కిన్నెరుల టెర్రకోట స్టాల్



ఉత్సవాల్లో జిల్లా వ్యవసాయ శాఖ స్టాల్



అస్సామీ డ్యాన్స్ ప్రదర్శన



మహిషాసుర మర్దిని నృత్యం ప్రదర్శన

క్లుప్తంగా

బలి జాతరకు సన్నాహాలు



దేవతలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్ జిల్లాలో ప్రసిద్ధ బొరిగుమ్మ బలి జాతరకు సన్నాహాలు ప్రారభమయ్యాయి. గురువారం పూజలు నిర్వహించి పాత బొరిగుమ్మ బలి ఇంటి నుంచి దేవతలను గ్రామస్తులు ఊరేగించారు. ఊరేగింపు భైరవ మందిర సమీపంలోని బలి ఘాట్‌కు చేరింది. బలిఘాట్ ప్రజలందరూ సమావేశమై ఇసుకను సేకరించారు. శుక్రవారం పాత బొరిగుమ్మలోని బలిగృహంలో విత్తనాలు ఊడుస్తామని, ఈనెల 26వ తేదీన మాఘమండై జాతర ప్రారంభమవుతుందని పూజారులు వెల్లడించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే మాఘ జాతర సందర్భంగా భక్తులకు ప్రసాద సేవన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 29వ తేదీన బలి జాతర పండగ జరుగుతుందని వెల్లడించారు.

ప్రెస్ క్లబ్ నూతన భవనం ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: స్థానిక టౌన్‌హాల్ వద్ద గజపతి ప్రెస్‌క్లబ్ భవనాన్ని కలెక్టర్ లింగరాజ్ పండా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పండా మాట్లాడుతూ.. మల్కన్‌గిరిలో కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్కడ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమాజంలో విలేకరులు, జర్నలిస్టులు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నారని తెలియజేశారు. సమాజంలో విలువలు కాపాడాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి, మున్సిపల్ ఇన్‌చార్జి కార్యనిర్వాహన అధికారి నటబర గోరోడో తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ (పురుషులు, మహిళల) కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవిరావు తెలిపారు. ఈ ఎంపికలు పాలకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మొదలవుతాయన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే పురుషులు 85కేజీలలోపు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను అనకాపల్లి పరిధిలోని అంకుపాలెం వేదికగా ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న 70వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు చిరంజీవిరావు పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99480 66185 (కె.రమేష్), 96033 05767 (జి.దామోదరరావు) నంబర్లను సంప్రదించాలని కోరారు.

జిల్లా దేవదాయ శాఖాధికారిగా హరిసూర్యప్రకాష్

- అరసవల్లితో పాటు అదనంగా జిల్లా బాధ్యతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న వి.హరిసూర్యప్రకాష్‌కు జిల్లా దేవదాయ శాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థానంలో ఉన్న సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాదరావుకు రామతీర్థం, మాన్సాస్‌లకు ఈఓగా బాధ్యతలను యథావిధిగా కొనసాగిస్తూ స్థానిక జిల్లా అధికార బాధ్యతలను నుంచి తప్పించినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్తగా జిల్లా బాధ్యతలు స్వీకరించనున్న హరిసూర్యప్రకాష్, అరసవల్లి ఈఓగా కూడా కొనసాగనున్నారు.

రిమాండ్ ఖైదీ పరారు

శ్రీకాకుళం క్రైమ్ : అంపోలు సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న యువకుడు వైద్య పరీక్షల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు వచ్చి పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాతీపేటకు చెందిన గుడియా కాళీ (22) రెండో పట్టణ పరిధిలో ఉన్న మైనర్ బాలికతో శారీరకంగా సంబంధం పెట్టుకున్నాడని ఈ నెల 9న ఫిర్యాదు అందడంతో.. పోక్సో కేసు కింద కేసు నమోదు చేసి ఇదే నెల 13న శ్రీకాకుళం సబ్ డివిజనల్ డీఎస్పీ మహేంద్ర మాతే విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేశారు. అతడిని రిమాండ్ కోసం శ్రీకాకుళం రూరల్ మండలం అంపోలు సెంట్రల్ జైలుకు తరలించారు. అతనికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఎస్కార్ట్‌గా నలుగురు ఏఆర్ పోలీసులను ఇచ్చి వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో మందులు తీసుకురావడానికి పోలీసులు వెళ్లగా అదే అదునుగా చూసుకుని కాళీ తప్పించుకుని పారిపోయాడు. రిమ్స్ పరిసరాల్లో ఎంత వెతికినా కనిపించకపోవడంతో టూటౌన్ పోలీసులు కాళీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి



జయపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: రోడ్డు ప్రయాణాల్లో రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వక్తలు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం రహదారి భద్రతా వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాలు వివరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీ అధికారి యజ్ఞేశ్వర పండ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రకాశ చంద్ర పట్నాయిక్, సీనియర్ ఉపాధ్యాయులు ప్రభాత్ కుమార్ రథ్, విశ్వరంజన్ గౌఢ, రెడ్‌క్రాస్ అధికారి శుభస్మిత సాహు, నరేష్ కుమార్ షాడంగి, సువర్ణ కుమారీ ఖిలో, తన్వీర్ అహ్మద్, దుర్గా ప్రసాద్ పాత్రో, దేవేంద్ర కుమార్ పాఢీ పాల్గొన్నారు.

కోట్‌పాడ్‌లో...

జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలపై పాఠశాల ప్రాంగణం నుంచి ఖెందుగుడ గ్రామం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సబిత మదల, ఉపాధ్యాయులు రతికాంత మహంతి, ప్రభాషిణి లిమాల, ప్రియదర్శిణీ మండల్, వణీత మహంతి, దమయంతి సాహు, సయిత గౌలారి తదితరులు పాల్గొన్నారు.



కోట్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల ర్యాలీ

కళింగ స్టేడియం సందర్శన



ఉదయ్‌నిధి స్టాలిన్‌కు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర మంత్రి తుషార్ కాంతి బెహరా

భువనేశ్వర్: తమిళనాడు ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం స్థానిక కళింగ స్టేడియంను సందర్శించింది. తమిళనాడు క్రీడలు–యువజన వ్యవహారాల శాఖ మంత్రి ఉదయ్‌నిధి స్టాలిన్ నేతృత్వంలో ఈ బృందం గురువారం రాష్ట్రానికి విచ్చేసింది. కళింగ స్టేడియంలో హాకీ ప్రపంచ కప్–2023 భారత్ – వేల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వీక్షించేందుకు విచ్చేసిన సందర్భంగా కళింగ స్టేడియంలో క్రీడా సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడలు–యువజన వ్యవహారాల విభాగం ప్రముఖ కార్యదర్శి ఆర్.వినీల్ కృష్ణ కళింగ స్టేడియంలో క్రీడా సౌకర్యాలను ఎల్ఈడీ తెరపై ప్రదర్శించి వివరించారు. క్రీడారంగం పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కృషిని ఉదయ్‌నిధి స్టాలిన్ అభినందించారు. క్రీడల్లో సాధన కోసం అందుబాటులో ఉంచిన వ్యవస్థపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర క్రీడలు – యువజన వ్యవహారాల శాఖ మంత్రి తుషార్ కాంతి బెహరా సాదరంగా స్వాగతం పలికారు.

ఉత్సాహంగా మిస్టర్ ఒడిశా పోటీలు



సెమిస్‌కు చేరినవారితో అధికారులు, ప్రజాప్రతినిధులు

బరంపురం: స్థానిక హిల్‌పట్నా రోడ్డులో ఉన్న బిజూ పట్నాయక్ సంస్కృతి భవన్‌లో కళింగ బాడీ బిల్డింగ్ సంఘం ఆధ్వర్యంలో అల్ ఒడిశా సీనియర్ స్టేట్ మిస్టర్ అండ్ మిస్ ఒడిశా బాడీ బిల్డింగ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే విక్రమ్ పండా, బరంపురం అభివృద్ధి సంస్థ చైర్మన్ సుభాష్ మహరణ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో రాష్ట్రంలోని 30 జిల్లాల నుంచి 80 మంది పాల్గొని ప్రతిభ కనబర్చారు. వీరిలో 5గురు సెమీ ఫైనల్స్‌కు సెలెక్ట్ అయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిరతరంజన్ స్వాంయి, కార్యదర్శి ప్రశాన్న మహేశ్వర్, కోశాధికారి తరిణి చటజీ, ఉపాధ్యక్షుడు బిశంబర్ బౌదర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న నోడల్ అధికారి మనోరంజన్

జయపురం: రాష్ట్రంలో హాకీ ప్రపంచ కప్ జరుగుతున్న సందర్భంగా ప్రజలకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు పంచాయతీ స్థాయిలో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పూజారిపుట్ పంచాయతీలో వాలీబాల్ పోటీలను సర్పంచ్ కిశోరి నాయిక్ గురువారం ప్రారంభించారు. నోడల్ అధికారి మనోరంజన్ ఖరొ మాట్లాడుతూ.. పంచాయతీల్లో వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు. సమితిలోని 22 పంచాయతీలకు గానూ టంకువ, డొంగరచించి, పూజారిపుట్ పంచాయతీల్లో పోటీలు ప్రారంభమయ్యాయన్నారు. అంబాగుడ, బలియ, ధన్‌పూర్, ఎకంబా, జాముండ, కొంగ, కుమిలిపుట్, బొడొజువిని, జయంతిగిరి, కలియగాం, కేవిడి, ఉమ్మిరి గ్రామాల్లో 20వ తేదీలోపు, 21వ తేదీన అంత బరిణిపుట్, గొడొపొదర్, హడియ, రొండాపల్లి, రాణీఘడ్ పంచాయతీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పంచాయతీ విస్తరణ అధికారి ప్రశాంత మిశ్ర అధ్యక్షతన జరిగిన క్రీడా ఉత్సవంలో జయపురం బీడీవో రాజీవ్‌దాస్, అదనపు బీడీవో మనోజ్ నాయిక్, ప్రభుత్వ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, సమితి సభ్యులు శివరాం పెంటియ, సివిల్ సప్లయ్ అధికారి చందన నాయిక్, జీఆర్ఎస్ జానకీ దేవి పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ఎంపీ రమేష్‌చంద్ర, ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మఝి తదితరులు

కొరాపుట్: తమ తండ్రి దివంగత మంత్రి జాదవ మఝి జ్ఞాపకార్థం ఆయన కుమారులు నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మఝి, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మఝిలు క్రికెట్ టోర్నమెంట్‌ను నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి దండాముండా గ్రామంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 29 ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, ఛత్తీష్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 30 టీములు పాల్గొనున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర లిఫ్ట్ ఇరిగేషన్ సలహాదారుడు ప్రమెద్ కుమార్ పాఢీ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న ఎంపీ రమేష్ చంద్ర మఝి

దాతలే.. స్ఫూర్తి ప్రదాతలు



ఆకలి తీర్చడానికి మించిన సత్కార్యం, అన్నం పెట్టడానికి మించిన దానం ఏముంటుంది. అది కూడా దేవుని సన్నిధిలో చేయగలిగితే ఆ మానవ సేవ మాధవ సేవతో సమానమవుతుంది. ఇలా 26 ఏళ్లుగా అరసవల్లిలో అన్నదాన క్రతువు జరుగుతోంది. దాతలు ఇచ్చిన విరాళాలతో ఇక్కడ భక్తుల కడుపు నిండుతోంది. అన్న పానీయాలను దేవుని ప్రసాదంగా స్వీకరిస్తూ అనునిత్యం వందలాది మంది భక్తులు ఇక్కడ ఆదిత్యాయ నమోస్తుతే అన్న మంత్రంతో పాటు అన్నదాత సుఖీభవ అన్న పదాన్ని పలుకుతూనే ఉన్నారు. ఈ విరాళాలు ఇప్పటికి రూ.5కోట్లకు చేరడం విశేషం.



- అరసవల్లిలో 1996 నుంచి కొనసాగుతున్న నిత్యాన్నదానం
- ఇప్పటివరకు రూ.5 కోట్ల వరకు విరాళాలు
- నెలకు సగటున 15 వేల మందికి అన్న ప్రసాదం

అరసవల్లి: సూర్యనారాయణుడి సమక్షంలో ఆత్మారాముని అర్చన సలక్షణంగా జరుగుతోంది. దేశంలో నిత్య పూజలు అందుకుంటున్న ఏకైక సూర్యదేవాలయంగా విశిష్ట గుర్తింపు పొందిన ఆరోగ్య క్షేత్రం అరసవల్లిలో స్వామి వారి అన్న ప్రసాదానికి కూడా ప్రత్యేకత ఉంది. ఇక్కడ 1996లో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించగా.. నేటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. గతంలో రోజుకు గరిష్ఠంగా వంద మంది వరకు అన్నదానం అందించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 300 కు చేరింది. నెలలో సుమారుగా ఈ సంఖ్య 15 వేలకు చేరిననట్లుగా రికార్డులు చెబుతున్నాయి. అలాగే ఉల్లి, వెల్లుల్లి, మసాలాలను వినియోగించకుండా చేస్తున్న కూరలు మంచి రుచికరంగా ఉండేలా ఆలయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రూ.5 కోట్లకు చేరిన విరాళాలు

నిత్యాన్నదాన పథకానికి అమలు కోసం పలువురు దాతలు తమవంతుగా విరాళాలను స్వచ్ఛందంగా అందజేస్తున్నారు. ఇలా వచ్చిన విరాళాలను ఆలయ అధికారులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ వడ్డీలతో అన్నదాన పథకాన్ని అమలు చేస్తున్నారు. 1996 నుంచి నేటి వరకు మొత్తం ఈ హెడ్ కింద రూ.5 కోట్ల వరకు విరాళాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో ఉన్నట్లుగా ఆలయ అధికారులు చెబుతున్నారు. అలాగే రూ.లక్ష వరకు విరాళాలను అందజేసిన దాతలు (రాజపోషకులు) మొత్తం 110 మంది వరకు నమోదయ్యారు.

రూ.500తో రోజుకు పది మందికి..

నిత్యాన్నదాన పథకంలో ఎక్కడినుంచి వచ్చిన భక్తులైనా అన్నప్రసాదాన్ని స్వీకరించవచ్చు. అలాగే విరాళాలను కూడా ఇవ్వవచ్చు. తమ గోత్రనామాలతో రశీదును పొందవచ్చును. అయితే ఒక రోజుకు కనీసం 10 మందికి అన్నదానానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే శాశ్వత విరాళంగా రూ.5000 (గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు) చెల్లించాలి. అయితే భక్తుల కోరిక మేరకు వారికి నచ్చిన రోజున ఏడాదికి ఒసారి అన్నదాన ప్రసాదాలను అందజేస్తారు. ఇక రూ.లక్ష వరకు విరాళాన్ని ఇస్తే ఆ వడ్డీతో ఏడాదికి 100 మందికి అన్నదానాన్ని గరిష్ఠంగా పదేళ్ల వరకు అందజేస్తారు.



అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు

రోజూ స్వామికి నివేదించిన తర్వాతే..

నిత్యాన్నదాన పథకంలో భాగంగా భక్తులకు అరటి ఆకుల్లో పులిహోర, అన్నం, సాంబారు, మజ్జిగ, కొబ్బరి పచ్చడి, శాకాహార కూర వడ్డిస్తారు. అలాగే ప్రతి ఆదివారం బన్సీ రవ్వతో స్వీట్‌ను కూడా వడ్డిస్తారు. అయితే ఈ తయారీ వంటలను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సూచనల మేరకు నిత్యం ఆదిత్యునికి నివేదించిన తర్వాతే భక్తులకు ప్రసాదంగా వడ్డిస్తారు. ఇంతవరకు ఆదివారం ఒక్కరోజే సుమారు 800 మందికి, మిగతా రోజుల్లో 300–400 మందికి మాత్రమే అన్నదానాన్ని అందజేసేలా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ చర్యలు చేపట్టారు. ఆదివారాల్లో మరింత పెంచే ఆలోచనను అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.

నాణ్యమైన అన్నప్రసాదం అందిస్తున్నాం..



ఆదిత్యుని అన్నదాన ప్రసాదాన్ని పూర్తి నాణ్యతతో అందిస్తున్నాం. ఈ ట్రస్ట్‌కు దాతల ప్రోత్సాహం నిజంగా అద్భుతం. కనీసం రోజుకు పది మందికి పైగానే భక్తులు కనీసంగా రూ.500 చొప్పున చెల్లిస్తుంటారు. అలాగే రూ.లక్ష వరకు విరాళం ఇచ్చేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. వీరి పేర్లతో కూడిన బోర్డులను అన్నదాన సత్రంలోనే ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతాం. వీలైనంతలో అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తాం.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

విరాళాలు ఇవ్వాలంటే..

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఒకరోజుకు రూ.500 చెల్లిస్తే కనీసం 10 మందికి అన్నదానం చేస్తారు.

- ఈ నగదును నేరుగా అరసవల్లి ఆలయం పేరిట మనీఆర్డర్ ద్వారా గానీ, నేరుగా గానీ చెల్లించాలి.
- శాశ్వత అన్నదానం కోసం రూ.5000 చెల్లించాలి. ఏదో ఒక రోజు చొప్పున పదేళ్ల పాటు ఈ పథకం అమలవుతుంది.
- అన్నదానానికి చెల్లించాల్సిన నగదును ఈఓ, శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం పేరిట యూనియన్ బ్యాంక్ (అరసవల్లి) ఖాతా నంబర్ 211110100009099...(ఐఎఫ్ఎస్‌సి కోడ్: యుబిఐఎన్ 0821110)లో నగదును ఆన్‌లైన్ ద్వారా జమ చేయాలి. లేదా నేరుగా ఆలయ విరాళాల కౌంటర్‌లో చెల్లించి, పేరు, గోత్రాన్ని అడ్రస్‌తో సహా వివరాలను ఆలయ సిబ్బందికి తెలియజేయాలి.
- ఆన్‌లైన్‌లో నగదు చెల్లించిన భక్తులు ఆ రశీదును అడ్రస్‌తోకూడిన వివరాలను ఆలయ అధికారిక వాట్సాప్ నంబర్ (8978914660, 9491000708)లకు పంపించాల్సి ఉంటుంది.

బ్యాంకు కాలనీలో చోరీ



బీరువా తాళాలు విరగ్గొట్టిన దృశ్యం



ఇంట్లో చిందరవందరగా పడివున్న వస్తువులు

రాయగడ: స్థానిక బ్యాంకు కాలనీలో నివాసముంటున్న కింతలి సాయి శ్రీనివాస్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఆరు బీరువాలను పగలుగొట్టి రూ.9 లక్షల నగదు, 780 గ్రాముల బంగారు ఆభరణాలతో సహా మరో 4 కిలోల వెండి ఆభరణాలను దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐఐసీ రస్మీరంజన్ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. సంక్రాంతి సందర్భంగా ఈనెల 15వ తేదీన పార్వతీపురంలో నివసిస్తున్న తమ బంధువుల ఇంటికి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు మంగళవారం అర్ధరాత్రి ఇంటి బయట గేట్ తలుపులను విరగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. బుధవారం సాయంత్రం ఊరు నుంచి తిరిగి వచ్చిన శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

బడి ఒడికి..



సెలవులు ముగిశాయి. బడి తలుపులు మళ్లీ తెరచుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో చలపతి రావు అనే ట్రాలీ రిక్షా కార్మికుడు తన మనవళ్లను ఇలా తీసుకెళ్తూ కనిపించారు. తన మనవళ్లకు ప్రభుత్వ బడిలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని అందుకే తానే స్వయంగా వారిని రోజూ ఇలా తీసుకెళ్తూ ఉంటానని చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

పోలీస్ సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కమాండెంట్ విక్రాంత్ పాటిల్, తదితరులు

డెంకాడ: రాష్ట్ర పోలీస్ సంఘం డైరీని చింతలవలస ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్ కమాండెంట్ విక్రాంత్ పాటిల్‌తో పాటు పలువురు అధికారులు, సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డి.వి.రావు, వి.నారాయణరావు, ఆర్ఐలు చంద్రశేఖర్, వెంకటరావు, కేకేఎం.రాజు, బాలకృష్ణ చౌదరి, సంఘం బెటాలియన్ అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, సెక్రటరీ ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మధుపాడలో డయేరియా ఛాయలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న వైద్యుడు సాయికృష్ణ

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ గ్రామంలో డయేరియా ప్రబలినట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. గ్రామంలోని మొండి వీధికి చెందిన ఐదు కుటుంబాల వారు గడిచిన కొన్నిరోజులుగా నీళ్ల విరోచనాలతో అనారోగ్యం పాలైనట్టు స్థానికుల సమాచారం. ఇటీవల రెండు రోజుల నుంచి బైరెడ్డి.రాధ, బెరెడ్డి విష్ణు, బూడి పవన్, వలిరెడ్డి రోషినిలు వాంతులు, విరేచనాలతో బాధ పడుతూ గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన విషయం తెలుసుకున్న మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సాయికృష్ణ వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



పార్వతీపురం: శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాల కోసం పార్వతీపురం మన్యం జిల్లాలో 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు కలిగి అర్హత గల నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మేరకు సాలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ/డిప్లమో అర్హతతో ఫోర్ వీలర్ టెక్నీషియన్, పదవతరగతి/ఇంటర్ /డిగ్రీ అర్హతతో ప్రొడక్షన్ మెకానిక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని స్పష్టం చేశారు. ఇందుకోసం హెచ్‌టిటిపిఎస్://ఫారమ్స్.జిఎల్ఇ/వైటిఎం3ఓఎఫ్ఇపియు 1డబ్యూజెయు5జిఙ6లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8555909899, 6305110947 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు రామభద్రపురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

రామభద్రపురం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికై నట్లు రామభద్రపురం ఉన్నత పాఠశాల పీడీ కొల్లి తవిటినాయుడు గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీతో పాటు హెచ్ఎం కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీలలో శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించనున్న డిస్క్‌త్రో, షాట్‌పుట్, పరుగు పందెం రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొననున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి వెళ్లాలని ఆకాక్షించారు.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..!

- వలస వచ్చి జీవనయానం
- వ్యవసాయ పనిముట్లు తయారీలో నిమగ్నం



కొలిమిలో ఇనుమును కాలుస్తున్న రాజస్థానీ మహిళలు



అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న టార్పాలిన్‌లు



కొలిమిలో కాల్చిన ఇనుమును సమ్మెటతో మోదుతున్న మహిళ

కొత్తవలస: బతికిందే ఊరు..మానిందే మందు అన్న చందాన కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చి ఈ ప్రాంతాల్లో వ్యవసాయానికి సాయం చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వారు ముడి ఇనుముతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. తెలంగాణ వాసులు ఇక్కడికి వచ్చి వరిచేల నూర్పులకు టార్పాలిన్‌లు అద్దెకు ఇస్తున్నారు. శ్రమజీవుల జీవనశైలిపై మానవీయ కథనం. పొట్ట చేతపట్టుకుని ఊరికి దూరంగా రాష్ట్రంకాని రాష్ట్రాలకు భాష తెలియని ప్రాంతంలో బతుకు పోరాటం చేస్తున్నారు వారు. శ్రమనే నమ్ముకుని కుటుంబాలతో సహా వలసబాట పట్టి వ్యవసాయ పనిముట్ల తయారీలో భాగంగా కొలిమిలో ఇనుము కాలుస్తూ పురుషులతో సమానంగా మహిళలు కూడా సమ్మెట వేస్తూ పలు రకాల వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నారు. డిసెంబర్ వచ్చిందంటే వందల కుటుంబాల వారు వలస బాటపట్టి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాంకుళం జిల్లాలకు వలసవచ్చి సంప్రదాయ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. తిరిగి ఫిబ్రవరి మెదటి వారంలో తిరుగు ప్రయాణమవుతారు. వలస వచ్చిన వారంతా రాజస్థాన్ రాష్ట్రంలోని సాగర్ జిల్లాకు చెందిన మార్వాడీ కుటుంబాల వారు. జిల్లాలోని పలు మండలాల్లో గల ముఖ్యమైన గ్రామాల్లో టెంట్లు వేసుకుని తాత్కలికంగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

అందరూ కష్టపడితేనే రోటీ

కుటుంబంతో సహా వచ్చిన వారంతా తమ కడుపు నిండేందుకు రోటీలకు కావాల్సిన డబ్బులు కష్టపడి సంపాదించు కుంటున్నారు. మహిళలు కొలిమివేసి పాత ఇనుమును కాలిస్తే పురుషలు సమ్మెట వేస్తూ వస్తువులను తయారు చేస్తున్నారు. కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, రకరకాల వ్యవసాయ పనిముట్లతో పాటు ఇంట్లోకి అవసరమైన వస్తువులను తయారు చేస్తున్నారు. పెద్దలు తయారు చేసిన వస్తువులను చిన్నారులు ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తూ బతుకు పోరాటం సాగిస్తున్నారు.

తెలంగాణ నుంచి..

ఈ ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమైతే తెలంగాణ, నెల్లూరు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున టార్పాలిన్‌లు పట్టుకుని కుంటుంబాలతో సహా వలస వస్తున్నారు. జిల్లాలోని ప్రతి జంక్షన్, ప్రధాన గ్రామాల్లో టార్పాలిన్‌లు గుట్టలుగా వేసి అద్దెకు ఇస్తుంటారు. అక్కడే చిన్న చిన్న గుడారాలను ఏర్పాటు చేసుకుని పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు.జనవరి చివరి నాటికి వారంతా తిరుగు ప్రయాణమవుతారు.

కుటుంబాలను పోషించుకోవడానికే



మా ప్రాంతంలో పంటలు సక్రమంగా పండక పోవడంతోనే జీవనోపాధి కోసం ఈ రంగాన్ని ఎంచుకున్నాం. గోనె సంచులు కొని అన్‌సీజన్‌లో టార్పాలిన్‌లు కుట్టి సీజన్‌లో ఆంధ్రాప్రాంతం వస్తున్నాం. సుమారు నెల రోజుల పాటు ఇక్కడ వ్యాపారం సాగుతుంది. టార్పాలిన్‌లకు ఈ ప్రాంతంలో మంచి గిరాకి ఉంది.

కె.బ్రహ్మయ్య, మహబూబ్‌నగర్, తెలంగాణ రాష్ట్రం

పని సులువుగా అవుతోంది



గ్రామాల్లో గతంలో మాదిరి వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వారు కరువయారు. ప్రస్తుతం రాజస్థానీలు తయారు చేస్తున్న వస్తువులు ఎంతో నాణ్యంగా ఉంటున్నాయి. తెలంగాణ వాసులు సమకూరుస్తున్న టర్పాలిన్‌ల వల్ల పని సలుభమవడంతో పాటు ఖర్చు కూడా తగ్గి సమయం ఆదా అవుతోంది.

గుల్లిపల్లి అప్పలరాజు, శ్రీరాంపురం, లక్కవరపుకోట మండలం

పులి దాడిలో ఒక్క ఆవే మృతి

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో పులి దాడిలో ఒక్క ఆవు మాత్రమే మృతి చెందిందని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కేవీఎస్ రాజు గురువారం తెలిపారు.గ్రామానికి చెందిన రైతు పారాది చంద్ర మోహన్ ఆవు మృతి చెందినట్లు చెప్పారు. రెండు ఆవులపై పులి దాడి చేసినట్లు ఎక్కడా ఆనవాళ్లు తమకు లభించలేదని, పశువైద్యాధికారులు కూడా దొరికిన ఆవు కళేబరం ఒక్కటిగానే గుర్తించి పంచనామా నిర్వహించినట్లు చెప్పారు. ప్రసుత్తం పులి జాడ కోసం అటవీ ప్రాంతంలో అమర్చిన కెమెరాలను బట్టి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలోని అనంతగిరి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.

గడ్డి దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామంలో ట్రాక్టర్‌తో ఉన్న వరి గడ్డి గురువారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు పెనల రాము అట్టాడలో వరి గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై లొట్లపల్లి తీసుకువస్తుండగా కళ్లం దగ్గరకు వచ్చేసరికి అక్కడ ఉన్న విద్యుత్‌వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న గడ్డితో పాటు పక్కనే ఉన్న రాము సొంత గడ్డి వాము కూడా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తి స్థాయిలో మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రైతుకు సుమారు రూ.40 వేల నష్టం సంభవించింది.

22న గుంటూరులో శాప్ టీటీ లీగ్ టోర్నీ

- ఆసక్తి గల వారికి ఆహ్వానం

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించబోయే టేబుల్ టెన్నిస్ లీగ్ టోర్నీలో ఆసక్తి గల జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు గురువారం తెలిపారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో జరిగే పోటీల్లో అండర్-13,17, ఓపెన్ కేటగిరీలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 21లోగా వారి పేర్లను ఫోన్ 984829 8333 నంబర్‌కు సమాచారమిచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న జగయ్యపేటలో బ్యాడ్మింటన్ లీగ్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 21న జగ్గయ్యపేట మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శాప్‌బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు తెలిపారు. అండర్-13, 17 వయస్సుల విభాగాల్లో బాల,బాలికలతో పాటు మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని, పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ముందు రోజు సాయంత్రం లోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

హత్య కేసు దర్యాప్తు ప్రారంభం



సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో ఈ నెల 16న లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంపై స్థానిక పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దానిని ఛేదించేందుకు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన స్థలాన్ని బుధవారం సాయంత్రం ఎస్పీ దీపికాపాటిల్ పరిశీలించిన విషయం తెలిసిందే. ఎస్పీ ఆదేశాల మేరకు బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో తెర్లాం, బాడంగి, రామభద్రపురం ఎస్సైలు ఆర్.రమేష్, జయంతి, సురేంద్రనాయుడులు మూడు బృందాలుగా ఏర్పడి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ప్రదేశానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. అలాగే విశాఖపట్నం నుంచి క్లూస్ టీం చేరుకుని సంఘటన స్థలంలో నిశితంగా పరిశీలించింది. అలాగే ఈ నెల 16కి ముందు రాజాం నుంచి రామభద్రపురం, రామభద్రపురం నుంచి రాజాం ఆర్అండ్‌బీ రోడ్డులో రాత్రి వేళల్లో వచ్చిన వాహనాల రాకపోకలను గుర్తించేందుకు సీసీ కెమెరాల్లో నమోదైన సీసీ ఫుటేజీలను పరిశీలించేందుకు పోలీసులు అవసరమైన చర్యలు చేపట్టారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఈవో రాధాకృష్ణ, ట్రస్టు బోర్డు చైర్మన్ దాలినాయుడు

మక్కువ: శంబర జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు అన్ని చర్యలు చేపడుతున్నామని పోలమాంబ ఆలయ ఈఓ రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ దాలినాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాతరలో 95 మంది దేవాదాయ శాఖ సిబ్బంది డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలమాంబ అమ్మవారి దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించనున్నామని తెలిపారు. ప్రత్యేక దర్శనం రూ.10, శీఘ్రదర్శనం రూ. 50, ఉచిత దర్శనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చదురుగుడి, వనంగుడి ఆలయాల వద్ద పెండాల్స్‌తో క్యూలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 150 గ్రాముల పులిహోర రూ.10, 80 గ్రాముల లడ్డూ రూ.15 చొప్పున భక్తులకు విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జాతరకు సుమారు లక్షా50 వేల మంది వరకు భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ధర్మకర్తల మండలి తీర్మానం ప్రకారం సిరిమానోత్సవం నిర్వహించే కమిటీ సభ్యులు ఎంపిక కోసం ఈ ఏడాది వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు.

కోడి పందెం నిర్వాహకుల అరెస్టు

- రూ.9,590 స్వాధీనం

గంట్యాడ: మండలంలోని గింజేరు గ్రామంలో రాళ్ల గెడ్డ వద్ద కోడి పందాలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పందెం నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 9590 స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు పయనం

- ఈనెల 21 నుంచి తాడేపల్లిగూడేంలో జరగనున్న పోటీలు



తాడేపల్లిగూడేంలో జరగనున్న ఫుట్‌బాల్ పోటీలకు పయనమైన జిల్లా బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు పయనమయ్యాయి. ఈ నెల 20, 21, 22 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేంలో అండర్-14 విభాగంలో జరగనున్న బాల, బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 30 మంది క్రీడాకారుల బృందం గురువారం బయలుదేరింది. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు రాణించాలని ప్రభుత్వ సంస్కృత పాఠశాల పీడీ తౌడుబాబు ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికితీసేందుకు స్కూల్‌గేమ్స్ పోటీలు చక్కని వేదికగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, ఇరుజట్ల కోచ్ అండ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో రహదారి భద్రతా వారోత్సవాలు



రోడ్ సేఫ్టీ వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, ఎస్పీ దీపికా పాటిల్

- కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్:

ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రభుత్వ శాఖలన్నీ పాల్గొని ప్రమాదాల నివారణకు వారి సలహాలు, సూచనలను అందించాలని కలెక్టర్ సూర్యకుమారి కోరారు. రహదారి ప్రమాదాలను తగ్గించడానికి శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆర్టీసీ బస్సులను రహదారిపై ఎక్కడపడితే అక్కడ ఆపకుండా నిర్దేశించిన స్టాప్ లలోనే ఆపేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు బజార్ల ముందు రహదారులపై దుకాణాలు అధిక సంఖ్యలో వెలుస్తున్నాయని వాటిని నిరోధించాలని సూచించారు. రహదారి భద్రతపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యాశాఖ ద్వారా అవగాహన తరగతులను నిర్వహించాలని చెప్పారు. ఈ వారోత్సవాల్లో రహదారి గుర్తులు, భద్రతపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించాలన్నారు. వీలైతే సిలబస్‌లో చేర్చి వారానికి ఒక తరగతి నిర్వహించాలని కోరారు. భోగాపురం హైవే పై పశువుల సంచారం, పాదచారుల క్రాసింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వాటిని నిరోధించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పోలీస్, జాతీయ రహదారుల శాఖ సంయుక్తంగా తనిఖీ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఓవర్ లోడ్ వల్ల ప్రమాదాలు

వాహనాలపై ఓవర్ లోడ్ వల్ల, కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఒకరిద్దరికి అపరాధ రుసుం వేస్తే ఓవర్ లోడింగ్ తగ్గించవచ్చని అభిప్రాయ పడ్డారు. అదే విధంగా హెల్మెట్ వాడకాన్ని కూడా ప్రోత్సహించాలని పోలీసు, రవాణా శాఖలే కాకుండా రెవెన్యూ ఇతర శాఖలు కూడా ఇందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్‌పీ దీపిక పాటిల్ మాట్లాడుతూ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన, మరణించిన వారి ఫొటోలను, వాహనాలను రహదారి కూడళ్లలో ప్రదర్శించాలని వాటిని చూసే వారికి భయం, బాధ్యత కలుగుతాయన్నారు. సమావేశంలో రవాణా శాఖ ఉప కమిషనర్ సుందర్, జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర రమణకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, డీఈఓ బీ.లింగేశ్వరరెడ్డి, ఆర్టీసీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- ముద్రించినా, వినియోగించినా కఠిన చర్యలు
- కలెక్టర్ సూర్యకుమారి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి జిల్లాలో ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని నిషేధించాలని సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు అన్ని విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం గురించి అనుసరించాల్సిన విధానాన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశంలో సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓలో పేర్కొన్న నిబంధనలను తు.చ.తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఈనెల 26 నుంచి జిల్లాలో ఎక్కడా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల స్థానంలో పర్యావరణ హితమైన క్లాత్ బ్యానర్లను వినియోగించుకోవాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఇంకా ఎవరైనా ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసినా, విక్రయించినా మొదటి తప్పుగా రూ.50 వేలు, రెండోసారి తప్పు చేస్తే రూ.లక్ష జరిమానాతో పాటు సంబంధిత పరిశ్రమ లేదా షాప్‌ను సీజ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుభకార్యాలు, పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ బ్యానర్లను ప్రదర్శించరాదని, తయారు చేయరాదని ఇతర ప్రాంతాలకు తరలించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో మరింత పర్యవేక్షణ అవసరమని అభిప్రాయ పడ్డారు.

వాయు కాలుష్యం లేకుండా ప్రమాణాలు పాటించాలి

జిల్లాలోని పట్టణాల పరిధిలో గాలి నాణ్యతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ, మున్సిపల్ విభాగ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాయు కాలుష్యం లేకుండా ప్రమాణాలు పాటించాలని గురువారం జరిగిన సమావేశంలో అధికారులకు సూచించారు. కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూపొందించిన విధివిధానాలను తప్పకుండా పాటించాలని పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ ద్వారా గాలి నాణ్యతను పరిశీలించాలని వాయు కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ఆరోగ్య అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ విభాగం ఈఈ సుదర్శనం, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ పాపారావు, మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్‌టీఓ ఆదినారాయణ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పోలీసు అధికారులు, ప్లాస్టిక్ తయారీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం గౌరవాధ్యక్షుడు రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

నెల్లిమర్ల:

రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర సలహాదారు సముద్రపు రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలోని ఆయన స్వగృహంలో రెండు జిల్లాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు చెల్లిస్తున్నట్లుగానే డీలర్లకు కూడా ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు రావాల్సిన ఎండీఎం రైస్ కమిషన్, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకుల కమిషన్‌ను సంఘం ట్రస్ట్‌కు బదలాయించాలని కోరారు. రెండు జిల్లాల్లో ఇప్పటివరకు మృతిచెందిన 125 మంది డీలర్ల కుటుంబసభ్యులకు ట్రస్ట్ ద్వారా రూ.10వేల చొప్పున ఫిబ్రవరిలో అందించడానికి తీర్మానం చేశారు. కందిపప్పు, పంచదార క్రెడిట్‌పై ఇప్పించాలని తీర్మానిస్తూ ఆ కాపీలను అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రెండు జిల్లాల సంఘం ప్రతినిధులు వాన నారాయణరావు, గేదెల సత్యనారాయణ, స్కురి సూర్యారావు, పాలూరు అప్పారావు, అట్టాడ అప్పారావు, కుసుమంచి జగ్గయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.